దీపావళి

కటిక చీకటిలో దీపాలు. నల్లటి ఆకాశంలో నక్షత్రాలు. కారు చక్కదనం నవ్వితే ముత్యాల పలువరసలు.

అరుగుమీద దీపాలు. వాకిలిముందర ముగ్గు బొబ్బాసి చెట్లమీద అమరించిన దీపాలు ఆకాశదీపాలు. ఇళ్ళల్లో దీపాలు, గుళ్ళల్లో దీపాలు: రంగురంగుల మతాబాలు, విదేశీ బాణాసంచులు, స్వదేశీ బాణాసంచులు, టపాకాయల ఫిరంగి మోతలు, చిచ్చుబుడ్లు, తూటాలు, తారాజువ్వలు, దీపాల పండుగ వెలుగువర్షము.

నోట్లో వేలు పెట్టుకొని, ఆ దీపాల వెలుగుల్లో మెరిసే కళ్ళతో నిలుచున్న ఆ పువ్వరిఅబ్బాయికి మాత్రం దీపావళి లేదు.

2

పొద్దున్నుంచీ బాణాసంచాలకొట్లదగ్గర చింపిరిజుట్టుతో అల్యూమినియం మురుగులతో, నీలి జేగురూ కలిసిన పంటి రంగు వెలుగుతో ఆ పువ్వరిఅబ్బాయి నిలిచి విసుబోతూ చూస్తూనే ఉన్నాడు. అందరికి బాణాసంచాలు; అతనికి మాత్రం లేవు.

సాయంత్రందాకా నుంచుంటేమాత్రం ఒక్క తాటాకు టపాకాయిగాని, సిసింద్రీగాని, మతాబా అగ్గిపుల్లగాని ఆ షరావాడిచేతిలో పెట్టే దయతో నిండిపోయినహృదయంకల

వాడు ఒకడూ కనిపించలేదు, పొద్దున్నించీ లక్షలకొద్దీ టపా కాయ లమ్మిన సాహెబు

"సాలా బాగా పేలుతాయండీ! జర్మనీవాడిఫిరంగి లాగా వుండాలి. మీాకే అయిదువందల్ ఏసుకోండి" అని విచిత్రంగా అమ్మగలిగాడుకాని, కొనేవాళ్ళకి చూపించ డానికి కాలిస్తే పేలకుండా, తుస్సుమన్న టపాకాయికూడా ఆ కుర్రవాణ్ణి ఏరుకోనిచ్చాడుకాదు.

పొద్దున్నుంచీ ఇంటికెళ్ళి తిండయినాతినలేదు ఆవుప్పరి వాడు. వాళ్ళమ్మా, నాన్నా, "ఎర్రోడు ఎక్కడికిపోయాడో గంజి నీళ్లకయినా వచ్చాడుకాదు" అని అనుకున్నాగాని, ఆ కుర్రవాడికోసం వెదుక్కుంటూ వచ్చినవాళ్లు లేనేలేరు.

ఆ సాయంత్రంనుంచి బందరువీధులన్నీ తిరిగి, ఆ కుం కాయి బచ్చుపేటలో బాగా బాణాసంచాలు కాల్చే ఒక మేడముందర నిలబడ్డాడు. ఆ ఇంటిలోని పెద్దలు ఆడపిల్లల చేత, మొగపిల్లలచేత కాల్పించిన బాణసంచాలు విదేశీవీ స్వదేశీవీ నలభై రూపాయలదాకా ఉంటాయి.

పిల్లల కిలకిలలు, పెద్దల నవ్వులు, గుమ్మందగ్గర కళ్లు లేని ముసలమ్మ బోసిహాసం. ఆ యింటిముందర బాణసంచా కాల్పులు చూడడానికి చేరిన తక్కిన బీదవాళ్ళపిల్లలు వెకి లిగా "ఇవి యివ్వండీ! అవి ఇవ్వండి!" అని అడిగి పుచ్చు కొని కాల్చుకొంటున్నారు. భయంచేత పారేసిన సగం కాలుతూ ఉన్న మతాబులు పుచ్చుకొని కాల్చారు. వీడు మాత్రంచూస్తూనే నిలుచున్నాడు. కాని ఒక్క అడుగయినా కదిలాడుకాదు,

వాడిఒళ్ళు ఉక్కుకడ్డిలాగే గట్టిగావుంది. మెరుగు పెట్టిన ఎర్రవాయిలా, నున్నగా తళతళలాడుతోంది. కను ముక్కు తీరుకలిగివున్న మొఖంమీద కాంతులు నృత్యం చేస్తున్నవి. మతాబాలవెలుగు ఆ జుట్టుమీద పడినప్పుడల్లా మబ్బుపింజలమీదపడిన సూర్యుడి వెలుగులా ఆడిపోయింది. వాడికి పొద్దుటినుండీ కడుపులో కూడులేదు.

3

సాయంత్రంవాడు ఆఇంటిదగ్గిర నిలుచున్నప్పటినుంచి ఆ యింటివారి వెధవాడపడుచు ఆ అబ్బాయివైపు తదేక దృష్టితో చూస్తూనేవుంది. ఆవిడకి ఇరవైయ్యాయిదేళ్ళు. చిన్నతనంలో సౌందర్యం మూటలు కట్టుకొన్న మురిపాల పడుచ యినా, సాంగత్యమెరుగని భర్తవియోగం సంభవించి ప్రేమ కోసం కుమిలిపోయిన సన్యాసినీ రూపం. వైధవ్యంలోనైనా అలంకరించుకొని అందంగా కనపడేవాళ్ళలాంటిది మాత్రం కాదు. తన జీవితంయొక్క పరమావధి ఏమిటా అని పుస్తకాలు వెతుక్కున్న అభాగ్యురాలు. భజనలకు వెళ్ళినా, గుళ్ళల్లో హరికథలకు వెళ్ళినా, పండితుల ఉపన్యాసాలకు వెళ్ళినా' సన్యాసుల జ్ఞానబోధకు వెళ్ళినా విధవయిన పురుషోత్తమ్మ తనకు అస్పష్టంగాతోచే జీవిత సత్యాన్ని కనుగొన డానికే బయలుదేరేది. ఆమెకు ఎప్పుడూ గుండె దడదడా కొట్టించేసేది. అందమైన ఆమెకళ్ళను మబ్బుల్ని చేసేది. తన చుట్టాలలో చూస్తూవున్న స్త్రీలమాతృత్వం మంగళ సూత్రంలేని ఆడదీ, మాతృత్వంలేని ఆడదీ, భూమిమీద మన

కూడదని సాయంకాలపు వెలుగుల్లో కలిసిపోతూ ఎవరూ చూడకుండా చీరకొంగు కళ్ళకద్దుకునేది. చుట్టాలపిల్లలు—బెల్లించి కొందరూ, భయపెట్టి కొందరూ,...ఆమె పెట్టెలో ఎప్పుడూ నిలవవుండే పిప్పరమెంటులు దినుసులూ, మిఠాయిదినుసులూ, డబ్బులూ లాగేసుండేవారు.

ఎవరిపిల్ల లేడ్చినా పురుషోత్తమ్మగుండె బద్దలయిపోయేది. చుట్టాలపిల్లలకి పడిశంభారకంపుచేసినా తుమ్ములు తగ్గేదాకా, ముక్కు వెంబడి పడిశం ప్రవహించడం మానేదాకా, వాళ్ళని వదిలేదికాదు. పిల్లలకి ఎవరికైనా పెద్ద జ్వరాలు వచ్చాయంటే పెట్టెలోదాచుకొన్న వెన్నముద్ద గోపాలవిగ్రహానికి, కాశీ—అన్నపూర్ణ విగ్రహానికి పెట్టని దణ్ణాలు లేవు, మొక్కులూ లేవు.

ఆ సాయంత్రంనుంచీ ఇంటి కెదురుగుండా నిలుచున్న ఉప్పరివాళ్ళబ్బాయిమీదనుంచి ఆమె చూపులు మరలిపోలేదు. చీకట్లలో కలిసిపోతూ, వెలుగుల్లో మెరిసిపోతూ కదలకుండా ఈకాలిమీదవంగి ఒకమాటూ, ఆకాలిమీదవంగి ఒకమాటూ నిలుచునివున్న ఆ పాపడు ఆమె హృదయాన్ని, ఆమె ఆలోచననూ ఇనుమును అయస్కాంతం లాగినట్లే లాగేశాడు.

పంచితే ఒక్కొక్క పిల్లవాడికిగాని, పిల్లదానికిగాని వచ్చిన అయిదురూపాయీల బాణసంచావున్న బుట్టనూ వాడి చేతికిచ్చి "నాయనా; కాల్చరా!" అందామనుకున్నది.

"ఓసి పిచ్చిదానా!" అని అందరూ నవ్వరా? ఏమిటీ పిచ్చి ఆలోచన?

4

ఉన్నట్టుండి కళ్ళుతిరిగి ఆ కుర్రవాడు భగ్నమైనఆశలు క్రిందకూలినట్లు పడిపోయాడు. ఆ జ్వాలామహోత్సవంలో అరుగుమీాదఉన్నవాళ్ళెవరికీ, ఆ కుర్రవాడు పడిపోవటం గమనించవలసిన అవసరమే లేకపోయింది. అది పురుషోత్తమ్మ చూచింది. ఒక్కపరుగులో మెట్లన్నీ దిగింది. తృణావర్తుణ్ణి హతమార్చి, భూమిమీాద వాలిపోయిన శ్రీకృష్ణుణ్ణి ఎత్తుకొన్న యశోదలాగ పురుషోత్తమ్మ ఆ బాలుణ్ణి ఎత్తుకున్నది; సావిట్లో బల్లమీాద పడుకోబెట్టి ఇంట్లోకి పరుగెత్తుకువెళ్ళి, వెండిగిన్నెలో ఇంతమజ్జిగపోసి అందులో ఇంత వేడివేడన్నం మెత్తగా పిసికి, మెతుకులు పిండిపారేసి ఆ గిన్నెపట్టుకు చక్కావచ్చింది.

ఆ పిల్లవాడినోట్లో చుక్క చుక్కా ఆమె పోయడం మొదలుపెట్టింది. ఇదంతాచూస్తూ తెల్లబోయి, వాళ్ళవాళ్ళేమీా మాట్లాడలేకపోయారు. అన్నసారం దిగినకొద్దీ ఆ పాపడికి ప్రాణం తెప్పరిలి నెమ్మదిగా మెళుకువవచ్చింది.

ఒక ముసలాయన:— ఈ వెధవను తీసుకువచ్చి బల్లమీాద పడుకోబెట్టిందేమిటి ? పాడుపని !

ఒకావిడ:—వీడెల్లా వచ్చాు డిక్కడికి ?

ఒక చిన్నపిల్ల:— మన యింటిముందర పడిపోతే అత్తయ్య తీసుకొచ్చింది.

ఆవిడ:—మడిగట్టుకొని ప్రతివెధవనీ ముట్టుకోవడమేనా ? మన పనివాళ్ళచేతికిఇస్తే నోట్లో పొయ్యరూ ?

ఆయన:—ఈవిడగారికి ఈ పెత్తన మేమిటి ?

పురుషోత్తమ్మ ఈ మాటలన్నీ వినడమే లేదు. ఆ కుఱ్ఱ వాడు కళ్లు విప్పేటప్పటికి ఆమె ప్రాణాలు కుదుటపడ్డాయి. చల్లని గాలిలా సంతోషం ఆమె దేహమంతా ప్రసరించింది. "నాయనా? ఇదంతా తాగు" అని ఆ గిన్నె వాడిచేతికిచ్చింది.

"ఇంక వీణ్ని పంపించు. చేసింద చాలు"

"నీ పేరేమిట్రా వెధవా! ఎవరబ్బాయివి.?"

"మే ముప్పరాళ్ళ ఉండి, నా పేరు చిట్టిగాడు,"

ఫోంచేసి చెయ్యికడుక్కొనివచ్చిన ఇంటియజమాని, "వాడిచేతులో రెండుకానులుపెట్టి పంపించివేయండి ఎవరైనా ఇల్లాంటివి చూస్తే మనకి అపఖ్యాతి కూడాను" అన్నాడు

5

ఇదంతాజరిగి ఏడాదయింది. మళ్ళీ దీపావళిపండుగ వచ్చింది. తాను చిట్టిగాడిని తన గదిలోనికి తీసుకువెళ్ళి వాడి చేతులో రహస్యంగా రెండు రూపాయలు పెట్టి నాలుగు మతాబులిచ్చి, పంపించిన ఆనాటి సంగతంతా, ఆమెకు జ్ఞప్తికి వచ్చింది. ఆమెకళ్ళ నీళ్ళు చెమరించినవి. చీకటిపడినదగ్గర నుంచీ దీపాలు వెలిగించుకుంటూ పదే పదే చూస్తూన్నది. పురుషోత్తమ్మ మూడేళ్ళ మేనగోడలు మొలకు కట్టిన బిళ్ళ అటూ ఇటూ ఆడుతూండగా, తోనలలాంటి ఒళ్ళు కదిలిపోతూండగా, చేతులాడించుకొంటూ పురుషోత్తమ్మదగ్గరకు పరుగెత్తివచ్చి, అత్తయ్యా! తపాకాయలంటే బయమేత్తుంది. అక్కా వాల్లూ కాల్తేతప్పులు నన్నెత్తుకోవూ?" అని పురుషోత్తమ్మ మెడచుట్టూ రెండుచేతులూ పెనవేసింది

"మాతల్లి! అల్లాగేనమ్మా, ఎత్తుకుంటానులే" అని

ఆవిడ ఆ బిడ్డను ఒళ్లోకి తీసుకొని ఒళ్ళంతా ముద్దుపెట్టుకొంది.

అప్పుడే చీకటి ప్రపంచమంతా రంగురంగుల వెలుగులతో అలంకరించుకుంటోంది. మతాబాలు వెలుగుతున్నై. వటేలుమంటూ టపాకాయలు పేలుతున్నై. అనంతపథాలలో ఉన్న నక్షత్రా లన్నింటిని పోగుచేసి, మళ్ళీ విశ్వంలోకి వదలుచున్నారా! అన్నట్లు శేరు తూటాలు జాజ్వల్యమయిపోతున్నై. ఇంతట్లో చిట్టిగాడు దీపావళి పొట్లాలు పట్టుకువచ్చి నెమ్మదిగా ఆవిడదగ్గర పెట్టాడు.

బీదవాళ్ళకు దీపావళిపొట్లాలే మతాబులు, కాకర పువ్వొత్తులు, టపాకాయలు, తూటాలున్నూ! మగ తాడిచెట్టు గులకలు పోగుచేసి, కాల్చి బొగ్గుచేసి గుడ్డలో పోసి పొట్లం కిందచుట్టి పేడరాసి, తాటికమ్మని నాలుగుబద్దలుకింద చీరి మధ్యన ఆ పొట్లంపెట్టి నిప్పులుపోసి బాగా అది రాజిన తరువాత దాన్ని తిప్పడం ప్రారంభిస్తారు చిటపటమని పేలుతూ రవ్వలు వర్షంకురుస్తవి. ఆ రవ్వల ప్రవాహంలో మునిగిపోయిన ఆ పిల్లల ఆనందానికి అంతుండదు.

పురుషోత్తమ్మ పొట్లాలు చూసింది, చిట్టిగాణ్ని చూసింది. చిట్టిగాడునవ్వుతూ ఆమెకేసి చూశాడు.

పురుషోత్తమ్మగుండె దడదడలాడింది. పురుషోత్తమ్మ మేనగోడలు చిన్నపిల్ల కిలకిలనవ్వి, చప్పట్లు కొట్టింది. పురుషోత్తమ్మ గబగబ లోపలికి పరుగెత్తుకువెళ్ళి మంచంకింద ఎవరికీ కనిపించకుండా, దాచిఉంచిన బాణసంచాబుట్ట ఇవతలికి తీసి చీరకొంగుచాటున కనపడకుండా పట్టుకు చక్కావచ్చింది.

ఆమె పెదవులు కంపించాయి. ఆమెకళ్లు చెమరిం

చాయి. ఆమె హృదయంలో ఏదో తీపిపుట్టి, ఆమెవక్షోజాలను ఉప్పొంగజేసింది.

"ఇది పుచ్చుకుని ఇంటికివెళ్ళి కాల్చుకో! పో!!" అని పురుషోత్తమ్మ ఆ బుట్ట చిట్టిగాడిచేతిలో పెట్టింది. చిట్టిగాడి మోము తళతళలాడిపోయింది. వాడిపెదవుల్లో కన్నుల్లో ఉషఃకాంతులవంటి నవ్వులు పరుగులిడినవి.

ఇంతట్లో ఎక్కడనుండి వచ్చాడో! కారుమేఘంలా చిట్టిగాడిదగ్గరికి, ఆ యింటియజమాని. వాడి చేతిలో బుట్ట లాక్కొని మొహం ఊడిపడేటట్లు ఛెళ్ళున ఒక్క లెంపకాయ కొట్టినాడు.

"వెధవముండకి పెత్తనాలు ఎవరిమ్మన్నారు? ఈబాణసంచా ఏమిటి? ఊళ్లోవాళ్ళందరికీ బాణసంచాలు పంచిపెట్టేటట్టయితే ఇల్లూవాకిళ్లూ ఆస్తులూ ఆగుతాయా?" అని "పోరా! వెధవా నిరుడొచ్చావు చాలదూ? మళ్ళీ శనిలా దాపురించావా" అని ఆ యింటియజమాని చిట్టిగాణ్ణి ఒక్క తాపు తన్నాడు.

"అమ్మయ్యో! చంపేశా"డని మడి అనికూడా ఆలోచించకుండా, అరుగుమీదనుంచి ఉరికి వాణ్ణి చివ్వున ఎత్తుకొన్నది పురుషోత్తమ్మ.

"ఛీ! పాడుముండా!"అంటూ ఇంటి యజమాని మెరుములా బుట్ట అరుగుమీద పెట్టడం, చిట్టిగాణ్ణి ఆమె చంకలోనుంచి లాగడం, ముట్టుకుంటేనే తన పవిత్రతఅంతా తగలబడిపోతుందేమో అన్నట్లు వాణ్ణి చెయ్యిపట్టుకొని వీధిమధ్యకి విసిరివేయడం అంతా తృటిలో జరిగిపోయింది.

6

చిట్టిగాడికి లోకం తల్లక్రిందులైపోయింది. రోడ్డుమీద రాయి తలకుతగిలి, పగిలి రక్తంకారడం మొదలుపెట్టింది. పురుషోత్తమ్మ కెవ్వున అరుస్తూ అరుగుదగ్గరే కూలిపోయింది.

ఈ గలభాకు ఇంట్లోవాళ్ళు పిల్లలూ, పెద్దలు, అరుగు మీదకు చక్కా వచ్చారు. పొట్లాలివ్వడం తప్పే, బుట్ట తీసుకోవడం తప్పే, ఉప్పరవాడై పుట్టడం తప్పే చిట్టిగాడి కేమి తెలుస్తుంది? వాడి మొఖంఅంతా రక్తమయమైపోయింది. ఉగ్రుడైపోయిన యజమాని ఇంకా రెండుదమ్ములు ఉన్నదానికి పిడికెళ్ళు ముడుచుకొని, కోరను కనపరుస్తూ కాట్లకుక్కలా కస్సు ఖస్సుమంటూ వాడి దగ్గరికి నడిచాడు. అరుగుమీద చంటిబిడ్డ ఒకటేగోల. వాడికొమ్ములు చూపిస్తూ, బుసకొట్టుతూ వచ్చే మహిషాసురుడిలా ఉన్న ఇంటియజమానుణ్ని చూచి సమ్మెటపెట్టులాగ తలమీద బాధఅయినా, గమనించకుండా, చిట్టిగాడు లేచి భయంతో కనుపాపలు తిరిగిపోగా కెవ్వు కెవ్వున అరుస్తూ పరుగెత్తడం ప్రారంభించాడు. పురుషోత్తమ్మ లేచింది. మహాశక్తిలా ఉగ్రురాలయిపోయింది. "ఈ రాక్షసుడు వుండే కొంపలో, నే నసలే వుండ"నని పొలికేక పెట్టింది. శోకాన్ని దుఃఖం తరుముకొనివచ్చింది. "చిట్టిగా! చిట్టిగా!" అంటూ వాడు వెళ్ళినదారినే తూలుతూ ఆమె ఆ దీపావళి-వెలుగుల్లో, చీకట్లల్లో వీధులలో సందులలోపడి నడిచిపోయింది.

"అత్తయ్యా కావాలీ, అత్తయ్యా కావాలి" అని అరుగుమీద చంటిబిడ్డ మారాం పెట్టింది.